ప్రజాశక్తి
బుధవారం 4 జూన్ 2025
5
అనంతపురం

వృద్ధురాలికి ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

వృద్ధులు, వికలాంగులకు ఇళ్ల వద్దకే రేషన్

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

చౌకధాన్యపు డిపోల ద్వారా అందించే రేషన్ సరుకులను వృద్ధులు, వికలాంగులకు ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలిపారు. అనంతపురం నగరంలోని కొవ్వూరు నగర్‌లో ఉన్న 6వ వార్డు ప్రభుత్వ చౌక దుకాణం పరిధిలో ఇంటి వద్దకే రేషన్ పంపిణీని మంగళవారం నాడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 65 సంవత్సరాలు పైబడిన, వికలాంగులు, మంచానికి పరిమితమైన కార్డుదారులకు ఇంటి వద్దనే సరుకులు అందించాల్సి ఉందన్నారు. చౌక దుకాణాలలో సరిపడా సరుకులు అందుబాటులో ఉన్నాయని, కార్డుదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ హరికుమార్, సిఎస్‌డిటి రామకృష్ణ, చౌక దుకాణం డీలర్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఏడాది పాలనలో..

ఏంమారింది

- కూటమి పాలనకు సంవత్సరం పూర్తి
- ఏడాదిలో ఏ మార్పు వచ్చిందంటూ ప్రశ్నలు
- ఎన్నికల హామీల అమలు నామమాత్రమే

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు 2024 జూన్ 4వ తేదీ వచ్చాయి. ఈ ఫలితాలు వచ్చి బుధవారం నాటికి సరిగ్గా ఏడాదవుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో టిడిపి, జనసేన, బిజెపి కూటమికి వంద శాతం స్థానాలు లభించాయి. 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలు కూటమికే దక్కాయి. అంతకు మునుపు అధికారంలోనున్న వైసిపికి ఒక్క స్థానం కూడా దక్కలేదు. ఈ రకంగా ఒకే పార్టీ అన్ని స్థానాలను జిల్లాలో దక్కించుకోవడం ఇదే ప్రథమం. 2014లో ఉరవకొండ, కదిరి అసెంబ్లీ స్థానాల్లో వైసిపి గెలుపొందగా, తక్కిన 12 స్థానాల్లో టిడిపి గెలిచింది. 2019లో చూస్తే ఉరవకొండ, హిందూపురం రెండు స్థానాల్లో టిడిపి గెలుపొంది, తక్కిన 12 స్థానాల్లో వైసిపి గెలుపొందింది. వీటన్నింటికీ భిన్నంగా 2024 ఎన్నికల్లో కూటమి అన్ని స్థానాల్లో విజయం సాధించింది.

ఏడాదిలో ఐక్యత ఏ మేరకు

టిడిపి, బిజెపి, జనసేన మూడు పార్టీలు కలసి ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించాయి. ఏడాది కాలంలో మూడు పార్టీల మధ్య ఐక్యత ఏ మేరకన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. జిల్లాలో బిజెపికి ధర్మవరం అసెంబ్లీ స్థానాన్ని కేటాయించారు. అక్కడి నుంచి సత్యకుమార్ పోటీ చేసి గెలుపొందారు. మంత్రి కూడా అయ్యారు. అక్కడి బిజెపి గెలిచిన తర్వాత స్థానికంగా టిడిపితో సఖ్యత అంతగా లేదన్నది వరుసగా జరుగుతున్న ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. ప్రతి సందర్భంలోనూ టిడిపి, బిజెపిల మధ్య ఘర్షణ బాహాటంగానే చోటు చేసుకుంటూ వస్తోంది. పట్టుకోసం రెండు పార్టీలూ పోటీ పడుతున్నాయి. తక్కిన నియోజకవర్గాల్లోనూ టిడిపి, బిజెపి, జనసేన నేతలకు పొసగడం లేదు. ఈ మూడు పార్టీల నడుమ అసంతృప్తుల మధ్యనే ఏడాది కాలం పూర్తయింది.

ఏడాదిలో జిల్లా అభివృద్ధి ఎంత.!?

ఎన్నికల్లో తిరుగులేని విజయాన్ని అందుకున్న టిడిపి కూటమి ప్రభుత్వం దేశంలోనే అత్యంత వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధికి ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకుందన్న చర్చ నడుస్తోంది. హంద్రీనీవా మొదటి దశ వైడనింగ్ చేపట్టింది. రెండో దశ లైనింగ్ చేపట్టింది. ఈ రెండింటిపైనా విపక్షాలు పెదవి విరుస్తున్నాయి. హంద్రీ నీవా మొదటి దశ వెడల్పు ఆరు వేల క్యూసెక్కులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం 3800 క్యూసెక్కులకే పరిమితం చేసింది. రెండో దశ లైనింగ్ వద్దని చెబుతున్నారు. లైనింగ్‌తో భూగర్భ జలాలు పెరిగే అవకాశముండదని చెబుతున్నారు. ప్రభుత్వం తన నిర్ణయం మేరకు లైనింగ్ పనులను శరవేగంగా చేసుకుని పోతోంది. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణను పూర్తిగా విస్మరించింది. జిల్లాకు అత్యంత కీలకమైన ఈ కాలువ పరిస్థితి పూర్తిగా అధ్వాన్నంగా ఉంది. ఇవి కాకుండా తాగునీటి పథకాల పరిస్థితి దయనీయంగా మారింది. వాటి అభివృద్ధికి చర్యల్లేవు. ఇప్పటి వరకు ప్రకటించిన పరిశ్రమలు అత్యధికం సోలార్, పవన విద్యుత్ ఉత్పత్తికి సంబంధించే ఉన్నాయి. వీటి వలన రైతుల భూములు పెద్దఎత్తున కోల్పోవడం తప్ప ఉపాధి ఉండదు. ఉపాధి కల్పించే పరిశ్రమలు జిల్లాకు అవసరమని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

ప్రకటనల్లోనే సూపర్-6

కూటమి నేతలు ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్–6 ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. ఈ హామీల్లో అత్యంత కీలకమైన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏడాది కాలంగా అమలు కాలేదు. ఇందులో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవను ఈ నెలలో, ఉచిత బస్సును ఆగస్టులో అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇవి ఏ మేరకు అమలు జరుగుతాయోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రజలకు నేరుగా ఆర్థిక పరమైన లబ్ధి చేకూర్చే వాటిలో పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇందులో పెంచిన పింఛన్లను క్రమం తప్పకుండా అందిస్తున్నా, ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేతలో తడబాటు కొనసాగుతోంది.



నైరాశ్యం నుంచి కోలుకోని వైసిపి

ఈ ఏడాది కాలంలో చూసినప్పుడు వైసిపి ఇంకా నైరాశ్యం నుంచి కోలుకోలేదు. అన్ని స్థానాలను కోల్పోయి జిల్లాలో వైసిపికి ఒక్క ఎమ్మెల్యే లేకుండా ఉన్నారు. పార్టీ కూడా అధికారంలో లేకపోవడంతో కొన్ని నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జిలు స్తబ్దతతో ఉన్నారు. స్థానిక సంస్థల్లోని కొంత మంది నేతలు అధికార టిడిపిలో చేరిపోయారు. వారిని నిలువరించలేని స్థితిలో వైసిపి ముఖ్య నేతలున్నారు. ఇప్పటికే కదిరి, మడకశిరతోపాటు కొన్ని పురపాలక సంఘాల్లో టిడిపి అధికార పీఠాన్ని ఎక్కింది. ఈ స్థానాల్లో వైసిపి తమ వారిని గట్టిగా నిలుపుకోలేకపోయిందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. ఇకపోతే సంస్థాగతమైన మార్పుల ద్వారా పార్టీలో జవసత్వాలు నింపేందుకు చర్యలు కూడా అధిష్టానం చేపట్టింది. ఇవి ఏ మేరకు ఫలిస్తాయన్నది చూడాల్సి ఉంది.

అధ్యాపకుల భర్తీకి కసరత్తు..!

నేడు విజయవాడలో విసి, రిజిస్ట్రార్లతో సమావేశం

ప్రజాశక్తి అనంతపురం

యూనివర్సిటీల స్థాయిలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా అనంతపురం, కలికిరి, పులివెందుల జెఎన్‌టియులు, అనంతపురం జెఎన్‌టియు ఒటిపిఆర్ఐ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులు భర్తీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. అనంతపురం జెఎన్‌టియు పరిధిలో ఎక్కువ భాగం ఆడహక్ లెక్చరర్లతో విద్యాబోధన జరుగుతోంది. గత ప్రభుత్వం అధ్యాపకుల నియామకాల కోసం నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ కోర్టు పరిధిలోకి వెళ్లడంతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. దీన్ని అధికమించి ఈ విద్యా సంవత్సరంలో అధ్యాపకుల ఖాళీలు భర్తీ చేయాలని ఉద్దేశంతో అన్ని రకాల జాగ్రత్తలు ప్రభుత్వం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా బుధవారం నాడు రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు వైస్‌ఛాన్సలర్లు, రిజిస్ట్రార్లతో ఉన్నత విద్యామండలి చైర్మన్ అధ్యక్షతన విజయవాడలో సమావేశం నిర్వహించనున్నారు. యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల భర్తీకి తీసుకోవాల్సిన అంశాలపై దిశా, నిర్ధేశం ఈ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి హాజరయ్యేందుకు అనంతరం జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ ఆచార్య హెచ్.సుదర్శన రావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్యలు మంగళవారం సాయంత్రం విజయవాడకు వెళ్లారు.

ఎడిసిసిబి చైర్మన్‌గా 'ముంటిమడుగు' బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ఎడిసిసి బ్యాంక్ నూతన చైర్మన్‌గా ముంటిమడుగు కేశవరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఆయన సోమవారం నగరంలోని ఎడిసిసి బ్యాంక్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎడిసిసి బ్యాంకు సిఇఒ శ్రీధర్‌చౌదరి, నెట్టెం వెంకటేష్, అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు

జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్యను అందించండి

కలెక్టర్‌కు ఎపిడబ్ల్యూజెఎఫ్ వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లాలో పత్రికలు, మీడియాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్యను అందించాలని ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్‌ను కలిసి మంగళవారం నాడు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు మాట్లాడుతూ పాత్రికేయులు ఎటువంటి జీతభత్యాలు లేకుండా సమాజంలోని సమస్యలను అనునిత్యం ప్రభుత్వం చేరవేస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేస్తున్నారన్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం కల్పించిన ఉచిత విద్య జీవో అమలు కావడం లేదన్నారు. ఈ ఏడాది ఉచిత విద్యపై ఉత్తర్వులు ఇవ్వడంతో పాటు, విధిగా అమలయ్యే విధంగా చూడాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అన్నది చాలా న్యాయమైన డిమాండ్ అని దీనిని ఈ ఏడాది కచ్చితంగా అమలు అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. వెంటనే డిపిఆర్ఒ సిబ్బందిని పిలిపించి బుధవారం నుంచి జర్నలిస్టుల పిల్లలకు సంబంధించిన దరఖాస్తులు తీసుకోవాలని ఆదేశించారు. జర్నలిస్టులు అందించిన వివరాలన్నిటిని సమగ్రంగా పరిశీలించి సంబంధిత పాఠశాలలకు డీఈవో ద్వారా ఆదేశాలు ఇస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజెఎఫ్ ప్రతినిధులు వేణుగోపాల్, నగేష్, సూర్య జయప్రకాశ్, సుధాకర్, తిమ్మప్ప, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

'దివ్యాంగుల హక్కుల చట్టం' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

దివ్యాంగుల హక్కుల చట్టం (తెలుగు అనువాదం) 2016 పుస్తకాన్ని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఇటుకులపల్లి ఎస్ఐ విజయ్ కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. వికలాంగులపై జరుగుతున్న దాడుల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల సంఘం నాయకులు డీఎస్పీని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి అనంతపురం జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కోఆర్డినేటర్ హరినాథ్ రెడ్డి, న్యాయ సలహాదారుడు జెన్నే ఆనంద్, గౌరవ సలహాదారుడు ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపిలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఆర్ఎంపిలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని డాక్టర్ శ్రావణ్‌కుమార్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఆర్ఎంపి, పిఎంపిలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ఆర్ఎంపిలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తమై ప్రభుత్వ ఆసుపత్రికి సమాచారం ఇవ్వాలన్నారు. గర్భిణులను స్కానింగ్ సెంటర్లకు పంపరాదని, చిన్నపిల్లలు, గర్భిణులకు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. ఎలాంటి కేసునైనా ప్రభుత్వ ఆసుపత్రికి సిఫారసు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో వైద్య సిబ్బంది, సూపర్వైజర్లు, నర్సులు పాల్గొన్నారు .

మోసానికి కేరాఫ్ జగన్

ఏపీ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అవినీతి, మోసానికి కేరాఫ్ అడ్రస్ మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అనిఏపీ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్ విమర్శించారు. మంగళవారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి తన కుంభకోణాల కేసుల నుంచి ప్రజల దష్టి మళ్లించడానికే ప్రతిసారీ ధర్నాలు చేస్తున్నాడని తెలిపారు. ఈసారి కూడా వెన్నుపోటు దినం అంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తన ఐదేళ్ల హయాంలో ప్రజలను నమ్మించి వెన్నుపోటు పొడిచాడు కాబట్టే 2024లో ప్రజలు ఆయన్ను ఇంటికి పంపారన్నారు. తన హయాంలో దొరికిన రీతిలో రాష్ట్ర సంపదను కొల్లగొట్టాడని దుయ్యబట్టారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ నాయకులు చేసిన అక్రమాలపై ప్రస్తుతం నమోదవుతున్న కేసులు, బయటపడుతున్న స్కాంల నుంచి ప్రజల దష్టి మళ్లించడానికే ధర్నాల డ్రామాలు ఆడుతున్నారన్నారు. మోసం, వెన్నుపోటు, గొడ్డలివేటుకు జగన్ రెడ్డికు పేటెంట్ దక్కుతుందన్న విషయాన్ని వైసిపి శ్రేణులు గుర్తించాలని తెలిపారు.

నిమ్మచెట్లు నరికివేత

యాడికి : మండల పరిధిలోని కత్తిమానుపల్లి గ్రామానికి చెందిన రైతు శివరామిరెడ్డి పొలంలో నిమ్మచెట్లను గుర్తు తెలియని దుండగులు మంగళవారం నరికివేశారు. డ్రిప్ పైపులు తగలబెట్టారు. ఉదయం పొలానికి వెళ్లిన రైతు దీనిని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. గిట్టనవారు ఎవరో ఈ పని చేసి ఉంటారని బాధితుడు తెలిపారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు పోలీసులు పొలాన్ని పరిశీలించారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు.

కార్మిక హక్కులపై బిజెపి దాడి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మికుల హక్కులను హరించేలా దాడి కొనసాగుతోందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ విమర్శించారు. సిఐటియు అనంతపురం నగర 11వ మహాసభలు మంగళవారం నాడు గణేనాయక్ భవన్‌లో జరిగాయి. మహాసభలో గడిచిన మూడేళ్లలో సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటాలపై చర్చించారు. గత పోరాటాలు, ఉద్యమాలను సమీక్షించుకుని, భవిష్యత్తు కర్తవ్యాలను నిర్ధేశించుకున్నారు. మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, సిఐటియు నాయకులు వి.రామిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. పని గంటలు పెంచుతూ పని భారాన్ని మోపే నిర్ణయాలు చేస్తోందన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో లేబర్ కోడ్స్ తీసుకువస్తోందన్నారు. వీటిని సిఐటియు ద్వారా అడ్డుకుని కార్మికులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిసూత జూలై 9న చేపట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మహాసభలో మాట్లాడుతున్న ఎస్.నాగేంద్రకుమార్

సిఐటియు నూతన కమిటీ ఎన్నిక

మహాసభ సందర్భంగా సిఐటియు నూతన కమిటీని ఎన్నుకున్నారు. నగర అధ్యక్ష, కార్యదర్శులుగా వై.వెంకటనారాయణ, ఎస్.ముత్తుజాలను ఎన్నుకున్నారు. వీరితో పాటు 30 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఆఫీసు బేరర్లుగా రామిరెడ్డి, గోపాల్, తిరుమలేశు, ఎర్రి స్వామి, నాగరాజు, లక్ష్మినరసమ్మ, వరలక్ష్మి లక్ష్మీనారాయణ, లతీఫ్, ఆజాం, ఆదినారాయణ, కిష్టా, చంద్ర, కమిటీ సభ్యులుగా సులేమాన్, అక్బర్, శివారెడ్డి, ఆదినారాయణ, సురేంద్ర, కుమార్, ప్రసాద్, రాజు, నరసింహులు, రామాంజనేయులు, స్వాతిలను ఎన్నుకున్నారు.

నూతన కౌలు రైతు చట్టం అమలు చేయాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని, నూతన కౌలు రైతు చట్టం అమలు చేయాలని కౌలు రైతు సంఘం నియోజకవర్గం కార్యదర్శి వెంకటేశులు, జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం విడపనకల్లులో కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో తహాశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి భరోసా లేదన్నారు. కౌలు రైతులను ఇబ్బందులు గురిచేస్తున్న జీవోలను రద్దు చేయాలన్నారు. పంటకు మార్కెట్ సౌకర్యం, గిట్టుబాటు ధర కల్పించాలని, అన్నదాత సుఖీభవ కింద రూ. 20వేలు ఇవ్వాలన్నారు. ఆత్మహత్యకు పాల్పడిన కౌలు రైతులకు షరతులు లేకుండా రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతుసంఘం నాయకులు

సిసిఆర్సి ఉన్న కౌలు రైతులందరికీ సబ్సిడీ విత్తనాలు, పురుగు మందులు, బ్యాంకు ద్వారా పంట రుణాలు, నిరుపేదలకు దేవాలయ భూములు కౌలుకి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు సురేష్, మండల నాయకులు సుంకన్న, జయన్న, చిన్న రామాంజి, పెద్ద రామాంజి, లక్ష్మన్న, సుధాకర్, మహేష్, సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మేపల్లిలో ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని గుమ్మేపల్లి, కల్లుమడి గ్రామాల్లో మంగళవారం ఎంపీడీవో భాస్కర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రవీందర్‌రెడ్డి పర్యటించారు. వారు గుమ్మేపల్లి బిసి కాలనీలో సర్పంచి దేగల లలితమ్మ, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తితో కలిసి పర్యటించారు. కాలనీలో 30 ఏళ్ల క్రితం వేసిన తాగునీటి పైపులైన్ దెబ్బ తినిందని, ఫ్లోరైడ్ సమస్య ఉందని గుర్తించారు. గత టిడిపి ప్రభుత్వంలో గుమ్మేపల్లి, ఏకులనాగేపల్లి గ్రామాల్లో అర్థాంతరంగా నిలిచిపోయిన అంగన్వాడీ భవనాలను పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గుమ్మేపల్లిలో ఫ్లోరైడ్ సమస్య ఉండడంతో నీటిని ల్యాబ్‌కు పంపించామని, ఈ సమస్యలను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే బుధవారం నిర్వహించే మండల సర్వసభ్య సమావేశంలో ఈ అంశంపై చర్చిస్తామని ప్రజలకు తెలిపారు. వారి వెంట పంచాయతీ సెక్రటరీ నాగరాజు, ఏఈ ఓబిరెడ్డి, నాయకులు దేగల శ్రీనివాసులు ఉన్నారు.

సాంకేతికతతో వ్యవసాయం లాభసాటి

జెడిఎ ఉమా మహేశ్వరమ్మ

ప్రజాశక్తి-శింగనమల

రైతులు నూతన సాంకేతికత, పద్ధతులు పాటించి అతి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ తెలిపారు. 'వికసిత్ కృషి సంకల్ప అభియాన్'లో భాగంగా మంగళవారం మండలంలోని సోదనపల్లి గ్రామంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య ముఖ్యఅతిథిగా హాజరైన జెడిఎ పంటల సాగులో పాటించాల్సిన నూతన పద్ధతులు, నూతన సాంకేతికత, మెలకువలతో పాటు ఉద్యాన, పశు సంవర్ధన శాఖ అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. విత్తన వేరుశనగ పంపిణీ, ఎరువుల సరఫరా, రైతు విశిష్ట సంఖ్య నమోదు, భూసార పరీక్షలు అవగాహన కల్పించారు. రెడ్డిపల్లి కెవికె ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లీశ్వరి వరి సాగులో మెలకువలు, వరి రకాలు, కాలిబాటలు, కలుపు మందుల పిచికారి, పిఎం కిసాన్, విత్తనశుద్ధి–వాటి ఉపయోగాలు, తెగుళ్ల, పరుగులు–నివారణ గురించి తెలిపారు. డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి పాడి పశువుల పెంపకం, వ్యాధులు నివారణ గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి అన్వేష్‌కుమార్ విఇఎస్ఎ, వాటి ప్రత్యేకతను తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కె.భార్గవి ప్రిన్సిపల్ సైంటిస్టు రెడ్డిపల్లి, డాక్టర్ జి. రాజన్న సీనియర్ సైంటిస్ట్ ఎఆర్ఎస్ రేకులకుంట, డాక్టర్ జి.శశికళ ఎస్ఎంఎస్(సిపి) రెడ్డిపల్లి, డాక్టర్ రఘుకిరణ్, సిద్ధారాంపురం, ఎంపిఇఒలు రాజారెడ్డి, అక్కమ్మ, చంద్రకళ, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడిఎ ఉమామహేశ్వరమ్మ

విలేకరులు కావలెను

ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు క్రింది తెలిపిన మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన

-: విలేకరులు కావలసిన ప్రాంతాలు :-

అనంతపురం జిల్లా: కూడేరు, వజ్రకరూర్, ఉరవకొండ రూరల్, కంబదూరు, అనంతపురం, విడపనకల్లు, శెట్టూరు

ఇంటర్వ్యూ : తేది: 11-06-2025 బుధవారం ఉదయం 10 గంటలకు

ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం,
D.No: 42/2, Near Industrial Estate, Old VRL Transport Godown,
Bellary Road, Ananthapuramu

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు : 9490099311,9490099312,313

చేదెక్కిన చీనీ ధర..!

ప్రజాశక్తి-ఆత్మకూరు

రైతులకు చీనీ సాగు కష్టతరంగా మారుతోంది. జిల్లాలో పండే చీనీకాయలకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. అలాంటి చీనీ సాగు చేసే రైతుల పరిస్థితి మాత్రం దయనీయంగా మారిపోయింది. మూడేళ్ల నుంచి చీనీ చెట్లకు విపరీతమైన తెగుళ్ల సోకి ఎండిపోతున్నాయి. వీటిని కాపాడుకోవడానికి విపరీతమైన పెట్టుబడి పెట్టి ఆమేరకు దిగుబడులు రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా నియోజకవర్గం లోని రాప్తాడు, ఆత్మకూరు. కనుగానిపల్లి రామగిరి, చెన్నేకొత్తపల్లి, అనంతపురం రూరల్ మండలాల పరిధిలో దాదాపు 25 వేల ఎకరాల్లో చీనీ పంట సాగులో ఉంది. ఆయా తోటల్లో ప్రస్తుతం చీనీ పంట కోత దశలో ఉంది. ఈనేపథ్యంలో ధరలు ఏమాత్రం పెరగకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది మార్చి, ఏప్రిల్ నెలలో టన్ను చీనీకాయలు రూ.40 నుంచి 50 వేల వరకూ ఉండేది. ప్రస్తుతం టన్ను రూ.20 నుంచి రూ.25 వేలకు పడిపోయింది. దీనికితోడు ఈ ఏడాది వాతావరణంలో మార్పులు కారణంగా కాయలు ఎక్కువ భాగం మంగు రావడంతో ధరలు మరింత తగ్గించి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. వేలకు వేలు ఖర్చు పెట్టినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

గతంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే రామగిరి, ఆత్మకూరు, కనగానపల్లి మండలాల్లో చీనీ సాగు ప్రధానంగా ఉండేది. సాగు భారం కావడంతో చాలామంది రైతులు వాటిని తొలగించి ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఉపక్రమించారు. కొత్తగా చీనీతోటల ఏర్పాటుకు రైతులు ఏమాత్రం ఆసక్తి చూపడం లేదు. గతంలో రైతులే చీనీ మొక్కల నర్సరీల సైతం ఏర్పాటు చేసి కర్ణాటక, తెలంగాణ ప్రాంతానికి విపరీతంగా సరఫరా చేసేవారు. ప్రస్తుతం నర్సరీలు సైతం కనుమరుగయ్యాయి. మరోవైపు ప్రభుత్వం నుంచి చీనీ సాగుకు ఆదరణ కరువైందని రైతులు చెబుతున్నారు. గతంలో పాతతోటల పునరుద్ధరణ పథకం కింద రైతులకు ప్రోత్సాహం ఉండేది. ప్రస్తుతం వాటికి ప్రభుత్వం మంగళం పాడడంతో పాటు చీనీ చెట్లు చనిపోతున్న వాటికి ఇన్సూరెన్స్ రావడం లేదు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ధరలు తక్కువగా ఉన్న విషయం వాస్తవమే..

ప్రస్తుతం మార్కెట్‌లో చీనీకాయల ధరలు తక్కువగా ఉన్న విషయం వాస్తవమే. మహారాష్ట్రలో దిగుబడి పెరగడంతో ధరలు పెరగనట్లు తెలుస్తుంది. తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మరిన్ని అవగాహన సదస్సులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటా..

- ఉద్యానవన శాఖ అధికారి, రత్నాకర్, రాప్తాడు

తీవ్రంగా నష్టపోతున్నాం..

ఆరుగాలం శ్రమించి పంట దిగుబడులు వచ్చే సమయంలో ధరలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ప్రభుత్వమే కనీస మద్దతు ధరగా టన్ను చీనీ కాయలు రూ 40వేలతో కొనుగోలు చేయాలి. ప్రస్తుతం కూలీలు, పురుగు మందులు, ఎరువుల ధరలు భారీగా పెరిగాయి. కాయలకు మాత్రం ధరలు ఆ విధంగా పెరగకపోవడంతో నష్టపోతున్నాం.

- ఆవుల ఈశ్వర్‌రెడ్డి, చీనీ రైతు, ఆత్మకూరు

రాయితీతో ఎరువులు అందజేయాలి..

ప్రభుత్వం రాయితీతో పురుగుమందులు, ఎరువులు అందజేయాలి. ప్రస్తుతం చీనీ సాగు కష్టంగా మారింది. లెక్కకులేనన్నిసార్లు పురుగు మందులు పిచికారి చేసినప్పటికీ ప్రయోజనం మాత్రం కనిపించడం లేదు. నకిలీ పురుగుమందులు పిచికారి చేస్తున్నామా లేక వాతావరణంలో మార్పులు కారణంగా ఈ తెగులు వస్తున్నాయా అర్థం కావడం లేదు. దీని నివారణకు నాణ్యమైన పురుగు మందులను ప్రభుత్వమే రాయితీతో అందజేయాలి.

- శివారెడ్డి చీనీ రైతు, ఆత్మకూరు

ప్రజావైద్యశాలలో అరుదైన శస్త్రచికిత్స

గుత్తి : పట్టణంలోని డాక్టర్ బ్రహ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో మంగళవారం ఓ మహిళకు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. ఆమె పొట్ట నుంచి రెండు కిలోల కణితిని డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, వైద్యులు తొలగించారు. మండలంలోని అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన లాలుస్వామి భార్య లక్ష్మి తీవ్రమైన కడుపునొప్పితో బాధ పడుతుండేది. దీంతో చికిత్స కోసం ప్రజా వైద్యశాలకు వెళ్లగా డాక్టర్ల బృందం ఆమెకు వైద్య పరీక్షలు చేసి గర్భాశయంలో కణితిని గుర్తించారు. అనంతరం డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, వైద్య బృందం మధ్యాహ్నం ఆమెకు శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తిచేసారు. కణితి కిలోలు ఉందని బి.ఇస్మాయిల్ వివరించారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

బొమ్మనహాల్ : గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని డిపిఒ సర్పంచులకు సూచించారు. మండలంలోని ఉంతకల్లు గ్రామంలో ఉన్న చెత్తతో సంపద కేంద్రాన్ని మంగళవారం డిపిఒ సర్పంచి ముక్కన్నతో కలిసి పరిశీలించారు. అనంతరం గ్రామంలోకి వెళ్లిన డిపిఒ ఇంటింటి చెత్త సేకరణపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, వీధి దీపాలు, తదితర సమస్యలపై ఆరా తీశారు. వారి వెంట ఈవోఆర్డీ దాస్, పంచాయతీ కార్యదర్శి పల్లవి, గ్రామస్తులు, సచివాలయం సిబ్బంది ఉన్నారు

బాధ్యతలు చేపట్టిన ఎంపిహెచ్ఎ జాన్సన్

బ్రహ్మసముద్రం : స్థానిక పిహెచ్‌సిలో మంగళవారం ఎంపిహెచ్ఎగా జాన్సన్ బాధ్యతలు చేపట్టినట్లు మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. శెట్టూరు మండలంలో పనిచేస్తున్న జాన్సన్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. జాన్సన్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తానన్నారు. ఆయనకు వైద్యులు, ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

వైసిపి నాయకుడికి పరామర్శ

యాడికి : టిడిపి, వైసిపి కార్యకర్తల ఘర్షణలో గాయపడి అనంతపురం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని బోయరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైసిపి మండల జాయింట్ సెక్రటరీ మారుతి కుమార్‌ను మంగళవారం ఆ పార్టీ మండల కన్వీనర్, తూట్రాలపల్లి పంచాయతీ సర్పంచి సంజీవరాయుడు, తలారి నాగేష్, వెంకటరామిరెడ్డి పరామర్శించారు. అధైర్య పడొద్దు అండగా ఉంటామని భరోసా కల్పించారు.

ఇంటి వద్దనే రేషన్ పంపిణీ

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని సలకంచెరువు గ్రామంలో మంగళవారం ఆర్డీఓ కేశవనాయుడు, తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేశారు. అధికారులు మాట్లాడుతూ 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, వికలాంగులు, మంచానికి పరిమితమైన కార్డుదారులు చౌక దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. చౌక దుకాణాల్లో సరిపడా సరుకులు అందుబాటులో ఉన్నాయని, కార్డుదారులు ఆందోళన చెందరాదని తెలిపారు. ప్రతినెలా 1 నుంచి 5వ తేదీ లోపు డీలర్ ఇంటి వద్దకే వచ్చి 65 ఏళ్ల పైబడిన కార్డుదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేస్తారని తెలిపారు.

పుట్లూరు : మండలంలోని మడుగుపల్లి, మడ్డిపల్లి, కొండగారికుంట, తదితర గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్ ఆంజనేయులు, తహశీల్దార్ శేషారెడ్డి ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ బియ్యం పంపిణీ చేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ 65 ఏళ్ల పైబడిన వృద్ధులతో పాటు వికలాంగులకు ప్రతి నెలా మీ ఇంటి వద్దకే వచ్చి రేషన్ బియ్యం అందిస్తారని, స్టోర్ వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీపై అవగాహన

పుట్లూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో అలివేలమ్మ అధ్యక్షతన ఫిజియోథెరపీపై అవగాహన సదస్సు నిర్వహించారు. బిపిటి రమేష్ మాట్లాడుతూ ఫిజియోథెరపీ చేయడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి సచివాలయ సిబ్బందికి వివరించారు. ప్రతి రోజూ ఫిజియోథెరపీ చేసుకుంటే ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావని తెలిపారు. కార్యక్రమంలో బిపిటి సతీష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ల వినతి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

జిల్లాలో ప్రస్తుతం నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీల్లో ఉమ్మడి అనంత పురం జిల్లాలోని ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలని కోరుతూ నగరంలోని మొదటి రోడ్డులో ఉన్న శారద నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాలలో ఎస్‌టియు ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా ఆరో రోజుకు చేరింది. ఇందులో భాగంగా మంగళవారం వారు టవర్ క్లాక్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ 2023లో తాత్కాలిక పద్ధతిలో ఇచ్చిన 230 స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ ఉద్యోగోన్నతుల ఖాళీలు తేల్చాలని, డీఎస్సీలో 30శాతం కోటాకు గానూ 103 పోస్టులు కేటాయించాలని, ఉద్యోగోన్నతులకు 70 శాతం కోటా ఇవ్వాలని, లేనిచో ధర్నా కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.సూర్యుడు, కోనంకి చంద్రశేఖర్, జయపాల్ నాయుడు, నరసింహులు, యుటిఎఫ్ నాయకులు లింగమయ్య, గోవిందరాజులు, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఫీఉద్దీన్, అంజినాయక్, ఆప్టా జిల్లా నాయకులు గోపాల్‌రెడ్డి, పీరునాయక్, వన్నారెడ్డి, సి.సూర్యనారాయణ, ఓబిరెడ్డి, ఆదినారాయణ, బి.సూర్యనారాయణ, నరసింహారెడ్డి, మురళి, భాస్కర్, మధుసూదన్, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సత్యప్రసాద్, శంకరమూర్తి, సురేష్, పీజీ లక్ష్మీనారాయణ, ఆదిశేషయ్య, నాగరాజు, మధు, ఆరుడప్పా, రమేష్, బి.శేషగిరి, శ్రీరాములు, ధనలక్ష్మి, ఆదినారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిరంకుశ విధానాలపై నేడు ర్యాలీ

ప్రజాశక్తి-అనంతపురం

సమావేశంలో మాట్లాడుతున్న శైలజనాథ్

కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, నిరంకుశ విధానాలపై బుధవారం నార్పలలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి, వైసిపి శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త శైలజానాథ్ తెలిపారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు రూ. 70వేల కోట్లు బాకీ ఉందని, తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు, ఎన్నికల హామీలు నెరవేర్చకుండా ఏడాదిగా కాలయాపన చేసిందని మండిపడ్డారు. అలాగే ఇంటింటికీ రేషన్ పంపిణీని తీసి వేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. నిరసన ర్యాలీలో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు పూల ప్రసాద్, భోగాతి ప్రతాపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ వైసిపి ఆధ్వర్యంలో బుధవారం నార్పలలో చేపట్ట నున్న వెన్నుపోటు దినం ర్యాలీలో మండలం నుంచి వైసిపి శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లి జయప్రదం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు, డిసిఎంఎస్ మాజీ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి కోరారు. నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9:30 గంటలకు నార్పలలోని వాల్మీకి ఆలయం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమై మెయిన్ రోడ్ సర్కిల్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకూ కొనసాగుతుందన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తారని తెలిపారు.

'ఉపాధి' బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-నార్పల



కూలీలతో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

ఉపాధి హామీ కూలీలకు తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎర్నాగప్ప డిమాండ్ చేశారు. వ్యకాసం నాయకులు మంగళవారం మండలంలోనీ కేశేపల్లి గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశం వద్దకు వెళ్లి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూలీలకు ఏడు వారాలుగా బిల్లులు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే బిల్లులు చెల్లించాలని కోరారు. వంద రోజులు పూర్తి చేసుకున్న కూలీలకు అదనంగా మరో వంద రోజులు పని దినాలు కల్పించాలని కోరారు.

అతిసార నివారణకు కృషిచేద్దాం

ప్రజాశక్తి-ఉరవకొండ

కూలీలతో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

అతిసారా నివారణకు కృషి చేద్దామని వైద్యాధికారిణి పావని సూచించారు. మండలంలోని రాకెట్ల గ్రామంలో మంగళవారం పిహెచ్‌సిలో డాక్టర్ పావని ఆధ్వర్యంలో ఆశా డే నిర్వహించారు. డాక్టర్ పావని మాట్లాడుతూ కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల అతిసార ప్రబలుతుందన్నారు. చిన్నపిల్లలు, వృద్ధుల్లో అతిసార మరణాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. పరిశుభ్రత పాటించడం, నీరు కాచి చల్లార్చి తాగడం ద్వారా అతిసారను నివారించవచ్చు అన్నారు. అతిసార నివారణపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆశా ఈ యాప్ ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని, గర్భిణుల కిట్లు తగినంతగా నిల్వ ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి.షఫీ, సూపర్వైజర్లు శేఖర్, స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి

రాయదుర్గం రూరల్ : రైతులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని ఎడిఎ లక్ష్మానాయక్, శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని జుంజురంపల్లి, ఆవులదట్ల, డి.కొండాపురం, వడ్రవన్నూరు, వేపరాల రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ నిర్వహించారు. రైతులకు పంటల సాగు విధానాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఏవో మహేంద్ర భూసార పరీక్షల ఫలితాలు, విత్తనాల రాయితీ పంపిణీ, వ్యవసాయ యాంత్రిక పరికరాల అందుబాటు, అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకాలపై వివరించారు.

హెచ్ఎల్‌సి డిస్ట్రిబ్యూటరీల్లో పూడిక, ముళ్లపొదలు తొలగించాలి

నార్పల : మండలంలో హెచ్ఎల్‌సికి అనుసంధా నంగా ఉన్న డిస్ట్రిబ్యూటరీల్లో పూడిక, ముళ్లపొదలు తొలగించాలని సాగునీటి సంఘం మండల అధ్యక్షులు గవ్వల పరంధామ కోరారు. ఆయకట్టు రైతులను దృష్టిలో ఉంచుకొని ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఉపాధి హామీ పనుల్లో భాగంగా హెచ్ఎల్‌సి డిస్ట్రిబ్యూటరీల్లో పేరుకు పోయిన పూడికను, దట్టంగా పెరిగిన ముళ్లపొదలను తొలగించి చివరి ఆయకట్టులోని ప్రతి పొలానికి నీరందేలా చూడాలని కోరారు. గతంలో డిస్ట్రిబ్యూటరీల్లో అడ్డంకుల వల్ల చివరి ఆయకట్టుకు నీరందక పలు గ్రామాల రైతులు ఘర్షణకు దిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. డిస్ట్రిబ్యూటరీల మరమ్మతులు కూడా చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నార్పల : మండలంలోని గూగూడు గ్రామంలో మంగళవారం గ్రామ వికాస్ సంస్థ ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆర్థిక సహకారంతో రైతులు, రైతు కూలీలు, మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. పొదుపు ఆవశ్యకత, బ్యాంకులో వివిధ ఖాతాల నిర్వహణ, బ్యాంకింగ్ ఆన్‌లైన్ సర్వీసులు, ప్రభుత్వ పథకాలు, జీవిత బీమా, వివిధ రకాల పాలసీలు, బ్యాంకుల నుంచి పొందే పలు రకాల ఉపయోగాల గురించి వివరించారు. కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంకు ప్రతినిధి హరినాథ్‌రెడ్డి, గ్రామ వికాస్ సంస్థ అధ్యక్షులు హనుమంతరెడ్డి, రీసోర్స్‌పర్సన్ రామలింగప్ప, రామకృష్ణ, గ్రామవికాస్ సిబ్బంది లక్ష్మీదేవి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రపై అవగాహన కల్పించండి

నార్పల : ఆశా కార్యకర్తలు యోగాపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిహెచ్ఓ బాలాజీ సూచించారు. స్థానిక పిహెచ్‌సిలో మంగళవారం మండలంలోని ఆశా కార్యకర్తలతో సాధారణ సమావేశం నిర్వహిం చారు. గత నెలలో ఆశా కార్యకర్తలు చేసిన పనులు, ఈ నెలలో చేయబోయే పనుల గురించి చర్చించారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమాచారం సేకరిస్తుంటారని, అలాగే ఈ నెల యోగాపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో యునాని వైద్యులు రఫీఉద్దీన్‌ఖాన్, వైద్య సిబ్బంది ప్రమీల, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల వద్ద వివరాలు ప్రదర్శించాలని వినతి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల వ్యాప్తంగా ఉన్న రేషన్ షాపులను రీఓపెనింగ్ చేయాలని కోరు తూ మంగళవారం జనసేన నాయకులు గ్రీవెన్స్ డే లో తహశీల్దార్ సుమతికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అన్ని రేషన్ షాపుల వద్ద కమాండ్ కంట్రోల్ సెంటర్ నెంబర్, రేషన్ పంపిణీ తేదీ, సమయం, నిత్యావసర సరుకుల వివరాలు, తదితర అంశాలు తెలిపే సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. స్పందించిన తహశీల్దార్ త్వరలోనే రేషన్ షాపుల వద్ద ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల జనసేన నాయకులు హెచ్‌వి.రాయుడు, కరేగౌడ్, మణికంఠ, క్యాతన్న, తిప్పేరుద్ర, రాజావలి, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై వేధింపులు తగదు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

మండలంలోని బోరంపల్లిలో రేషన్ డీలర్‌పై అగ్రవర్ణాల వేధింపులు, వివక్షను ఖండిస్తూ మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర దళిత, గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ బోరంపల్లిలో 40 ఏళ్ల నుంచి అగ్రకులాలకు చెందిన వ్యక్తి రేషన్ డీలర్‌గా కొనసాగేవారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత మాదిగ గోపాల్‌కు డీలర్‌గా అవకాశం ఇచ్చారన్నారు. అయితే అతడిని ఎలాగైనా తొలగించాలని కొందరు వ్యక్తులు కుట్రలు, అణిచివేసే చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకొని, దళితులకు రక్షణ కల్పించాలని, లేనిచో న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో దళిత జన జాగృతి అధ్యక్షులు ఆర్‌కె.రాజు, గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షులు తిప్పేనాయక్, ఎస్సీ, ఎస్టీ జెఎసి తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు రామాంజనేయులు, ఎల్ఆర్ఎఫ్ ఓబులేసు, ఎమ్మార్పీఎస్ నాయకులు మారెన్న, నాగరాజు, రవి, దుర్గప్ప, రేషన్ డీలర్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం'ను జయప్రదం చేయండి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-ఉరవకొండ

వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

సూపర్ సిక్స్ పథకాలు, ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం వైఫల్యాలను నిరసిస్తూ బుధవారం వైసిపి ఆధ్వర్యంలో చేపట్టనున్న 'వెన్నుపోటు దినం'లో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని శాసనమండలి ప్రివి లేజ్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌సి వై.శివ రామిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎపిలో మూడు పార్టీలు కలిసి కూటమి ప్రభుత్వంగా ఏర్పడ్డాయని, అయితే ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు, హామీల అమలుపై దృష్టిపెట్టక పోగా ఏడాది పాలనలో వైఫల్యాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ

ఈ నెల 4వ తేదీ వైసిపి ఆధ్వర్యంలో ఉరవకొండలో చేపట్టనున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని విడపనకల్లు ఎంపీపీ కరణం పుష్పవతి భీమ్‌రెడ్డి, మండల కన్వీనర్ డోనేకల్ రమేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వం కాదని ఇది ప్రజలను ముంచే ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల ఉపాధ్యక్షులు నాగేంద్ర, మండల కన్వీనర్ గిరిబాబు, సర్పంచులు రామాంజనేయులు రెడ్డి, ఉమాశంకర్, నాయకులు సుంకన్న, కరణం భీమ్‌రెడ్డి, దేశాయి సిద్దార్థ, రాజశేఖర్, హంపయ్య, ధనుంజయ్యరెడ్డి, తిమ్మరాజు, హను మంతు, రాఘవేంద్ర, రామాంజనేయులు, ఓబుళప్ప, నాగరాజు, శ్రీరాములు, మల్లికార్జునరెడ్డి, పెద్దన్న, రామన్న, సోమశేఖర్, అశోక్, దామోదర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శ్రీనివాసులు, మహేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలను ఉపసంహరించాలి

ప్రజాశక్తి-శింగనమల

విద్యుత్ ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహ రించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. సిపిఎం మండల కమిటీ ఆధ్వ ర్యంలో మంగళవారం శింగనమలలో 'మా ఇంటికి స్మార్ట్ మీటర్ వద్దు.. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి' కరపత్రాలను విడుదల చేశారు. భాస్కర్ మాట్లాడుతూ విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రజలపై రూ. 15,485 కోట్ల భారం వేసిందన్నారు. ఈ భారాలకు గత వైసిపి ప్రభుత్వం కారణమని కుంటి సాకులు చెబుతోందన్నారు. ప్రతిపక్షంలో ఉండగా సర్దుబాటు ఛార్జీలను ఖండించిన టిడిపి, జనసేనపార్టీలు అధికారంలోకి రాగానే అదే విధానాన్ని కొనసాగించడం దుర్మార్గమ న్నారు. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో వేల కోట్ల భారం వేయగా, కేంద్ర ప్రభుత్వం వినాశకర విద్యుత్ విధానాలు అమలు చేసిందని మండిపడ్డారు. ఇళ్లకు స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు ఏర్పాటు చేయడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. హిందూపురంలో 42 ఏళ్లుగా నడుస్తున్న ప్రీ కాట్ బి మిల్లు పెరిగిన విద్యుత్ ఛార్జీల వల్ల మూతబడిందన్నారు. సెకి ఒప్పందాన్ని రద్దు చేయా లని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల ఏర్పాటు ప్రతిపాదనను ఉపసంహరించు కోవాలని, వినాశకరమైన సెకి ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎర్రి స్వామి, కుళ్లాయప్ప, కుళ్లాయిస్వామి, కొండారెడ్డి, శ్రీనివాసులు, సుంకన్న, లక్ష్మీనారాయణ, సూర్యప్రకాశ్, రామాంజనేయులు, అంజి, మునెప్ప, వెంకట్రాముడు, జయరాముడు, కేశన్న, ఆదినారాయణ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుని మృతికి నివాళి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం గ్రామపంచాయతీ వర్కర్‌గా పనిచేస్తున్న పవన్ కుమార్ అనారోగ్యంతో మంగళవారం మరణించారు. గత ఐదు సంవత్సరాలుగా బుక్కరాయసముద్రం గ్రామపంచాయతీ వర్కర్‌గా పవన్‌కుమార్ పని చేస్తున్నారు. కార్మికుని మృతి వార్త తెలుసుకున్న సిఐటియు నాయకులు ఆయనకు నివాళులు అర్పించారు. కార్మికుల సమస్యల పరిష్కారం జరిగే ఆందోళన కార్యక్రమాల్లో పవన్‌కుమార్ ముందుడేవారని సిఐటియు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సి.నాగేంద్ర, మండల నాయకులు నెట్టికంటయ్య ఎర్ర కొండప్ప, నాగరాజు, సుబ్రమణ్యం, ఎర్రి నాగయ్య, నాగేంద్ర తదితరులు నివాళులు అర్పించారు. సర్పంచి ఎ.పార్వతి, గ్రామ కార్యదర్శి పెద్ద శ్రీనివాసులు ఆధ్వర్యంలో పవన్‌కుమార్ దహన సంస్కారాల నిమిత్తం రూ.15వేల ఆర్థిక సాయాన్ని అందించారు.

మహిళలకు శారీ ప్రీ ప్లేటింగ్ వర్క్‌షాప్

ప్రజాశక్తి-అనంతపురం

శిక్షణకు హాజరైన మహిళలు

నగరంలోని అశోక్‌నగర్‌లో ఉన్న జస్ట్ కిడ్జ్ ప్లే గ్రూప్ పాఠశాలలో మగువ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం శారీ ప్రీ ప్లేటింగ్ వర్క్‌షాప్ నిర్వహించారు. మేక్ ఓవర్ బై అను అనే మేకప్ ఆర్టిస్ట్ తరపున సి.అనూష మహిళల కోసం ఉచితంగా ఈ వర్క్ షాప్ ఏర్పాటు చేశారు. ఇందులో 25 మంది మహిళలు పాల్గొని శిక్షణ పొందారు. ప్రీ ప్లేటింగ్ చీరలను ముందుగానే తయారు చేసి పెట్టుకోవడం వల్ల చీరను త్వరగా కట్టుకోవడమే కాకుండా వీటిని ఉపాధి మార్గంగా కూడా ఉపయోగించుకో వచ్చునని తెలిపారు. కొత్తగా పెళ్లయిన మహిళలు, కొత్తగా చీర కట్టుకోవడం ప్రారంభించిన మహిళల కోసం ఇలాంటి వర్క్ షాపులు ఏర్పాటు చేసి చీరను అందంగా ఎలా కట్టుకోవాలి, త్వరగా ఎలా కట్టుకోవాలి లాంటి చిట్కాలు, పద్ధతులను అందరికీ అర్థమయ్యేలా తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఎంత పెద్ద బార్డర్, జరి అంచు ఉన్న చీర అయినా, ఎంత బరువు ఉన్న చీర అయినా సులభంగా కట్టుకునే లాగా ఈ 1 మినిట్ చీరలు ఉపయోగపడతాయన్నారు. మగువ సంస్థ ఇలా మహిళలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తూ మహిళలకు ఉపాధి మార్గం చూపించడం ఎంతో సంతోషంగా ఉందని జస్ట్ కిడ్జ్ ప్లే గ్రూప్ పాఠశాల అధినేత సంధ్య, శ్రీలక్ష్మి, బి.సుశీల తెలిపారు.

ప్రజల ఆరోగ్యం కోసమే యోగా

ప్రజాశక్తి-నార్పల

దేశంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నాయని ఎంపిడిఒ మమతాదేవి తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం యోగాంధ్రపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడు తూ ప్రజలందరూ మానసిక, శారీరక దృఢత్వం పెంచుకోవడానికి, ఆరోగ్యకరమైన జీవితం గడపటానికి, రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవడానికి యోగా ఉపకరిస్తుంద న్నారు. కావున ప్రతి ఒక్కరూ రోజూ ఉదయం అరగంట సేపు తప్పనిసరిగా యోగా చేయాల న్నారు. యోగాంధ్ర కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. స్థానిక సత్యసాయి అనాథాశ్రమంలో చిన్నారుల చేత పలు యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ శైలజారాణి, ఎపిఒలు ఎర్రమ్మ, రమేష్, రామారావు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది సుబహాన్, రవీంద్రనాథ్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, సురేష్, పార్వతమ్మ, యునాని వైద్యులు రఫీ ఉద్దీన్ ఖాన్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-గుంతకల్లు

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరి

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని డిసిపియు ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరి, అంగన్వాడీ సూపర్వైజర్ శ్రీదేవి తెలిపారు. పట్టణంలోని జగద్గురు మఠం సమీపంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం సూపర్వైజర్ శ్రీదేవి, టీచర్ భారతి ఆధ్వర్యంలో కిశోర బాలికలకు బాల్య వివా హాలు, కిశోరి వికాసం, నాయకత్వం, సాధికారత అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిసిపియు ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరి హాజరై మాట్లాడారు. బాలి కలు పౌష్టికాహారం తీసుకోవాలని, సెల్‌ఫోన్ వాడ కంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమం లో సచివాలయం మహిళా కానిస్టేబుల్, కిశోర బాలికలు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి-శింగనమల

'కిశోరి వికాసం'లో భాగంగా మంగళవారం మండలంలోని జులకాలవ గ్రామ అంగన్వాడీ కేంద్రంలో సూపర్వైజర్ పి.ఉమాదేవి ఆధ్వర్యంలో బాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సూపర్వైజర్ మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు బాలికలు వివాహం చేసుకోకూడదన్నారు. బాల్య వివాహం వల్ల బాలికలకు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. బాల్య వివాహం గురించి తెలిస్తే 1098కు సమాచారం ఇవ్వాలని, అధికారులు సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచి బాల్య వివాహాలను అడ్డుకుంటారన్నారు. బాలికలు విద్య, ఆరోగ్యం, ఆర్థికంగా ఉన్నతస్థితికి చేరుకోవాలన్నారు. వేధింపులు ఎదురైతే మహిళా పోలీస్‌కు, అంగన్వాడీ టీచర్‌కు, తల్లిదండ్రులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త లక్ష్మీదేవి, హెల్పర్, కిశోర్ బాలికలు, పిల్లలు పాల్గొన్నారు.

పుట్లూరు : స్థానిక అంగన్వాడీ కేంద్రం-3లో మంగళవారం కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంపీడీవో అలివేళమ్మ, సిడిపిఒ భారతి హాజరై మహిళా సాధికారత, బాలికల అక్రమ రవాణా అరికట్టుట, ఆరోగ్య సంరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాల నిషేధ చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఇఒ శ్రీదేవి, సూపర్వైజర్ ఎం. లావణ్య, సి. శాంతమ్మ, వెలుగు సిసి శారద, మహిళా పోలీస్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

In the Court of the Prl. District Judge: Ananthapuramu

E.P.No.725/2024 in O.S.No.56/2016

Between:
P.Lakshmi Narayana Reddy
...Petitioner/D.Hr
And
E.Govinda Reddy S/o Chinna Kullayappa, R/at Narasanayanakunta Village, Anantapuramu Rural Mandal.
...Respondant/J.Dr

వేలం ప్రకటన

అర్జీదారుడు తన డిక్రీ మొత్తము రాబట్టుకొను నిమిత్తం ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చియున్నారు. వేలంలో పాల్గొనదలచినవారు 16-06-2025వ తేది ఉ॥10.30 గం॥లకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలంలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు:

Property Situated within A.Narayanapuramu Village Polam and Panchayat within SRD of Anantapuramu Rural and RD of Anantapuramu.

Item No:1
Govt.Dry Sy.No.1-1, Extent A.C: 7-10 H.S. 2.875
Item No:2
Govt.Dry Sy.No.1-2, Extent A.C: 5-70 H.S. 2.310
Item No:3
Govt.Dry Sy.No.57-1, Extent A.C: 4-75 H.S. 1.924

Amina Value:	D.Hr Value:
Item No:1 Rs.1,45,00,000/-	Rs.22,00,000/-
Item No:2 Rs.1,10,00,000/-	Rs.21,00,000/-
Item No:3 Rs. 98,00,000/-	Rs.15,00,000/-

(By Order of the Court)

హెచ్.రామసుబ్రమణ్యం, అడ్వకేటు
అనంతపురం.